ఘనంగా ఆలయ వార్షికోత్సవం



చండీహోమంలో పాల్గొన్న భక్తులు

అత్తాపూర్: హైదర్‌గూడలోని శ్రీ అలీ పోచమ్మ ఆలయ ద్వాదశ వార్షికోత్సవాలు శుక్రవారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా అమ్మవారికి అభిషేకం, మండపారాధన, గణపతి హోమం, చండీ హోమం, మహిళలతో సామూహిక శ్రీ లలితా సహస్రనామ కుంకుమార్చన తదితర పూజా కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్న ప్రసాద వితరణ కార్యక్రమాన్ని చేపట్టారు. పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలను స్వీకరించారు.

సందడిగా 'సంసిద్ధత మేళా'



మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ అధ్యక్షుడు వెంకటేష్

మైలార్‌దేవ్‌పల్లి: బాబుల్‌రెడ్డినగర్ అంగన్‌వాడీ కేంద్రంలో పాఠశాల సంసిద్ధత మేళా కార్యక్రమాన్ని శుక్రవారం సందడిగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న బీఆర్‌ఎస్ పార్టీ డివిజన్ అధ్యక్షుడు ఎస్.వెంకటేష్ మాట్లాడుతూ... విద్యారంభంలో మౌలిక నైపుణ్యాలు, అనుకూల వాతావరణం కల్పించడం లాంటి కార్యక్రమాలు కీలకమని అన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల మధ్యమంగా చిన్నారుల్లో సజనాత్మకతను పెంపొందించడం వల్ల భవిష్యత్తులో వారు నైపుణ్యం గల విద్యార్థులుగా ఎదిగే అవకాశం ఉందని అన్నారు. అంగన్‌వాడీ టీచర్ అనిత, నవయువ యూత్ క్లబ్ అధ్యక్షుడు ఏర్వ కుమారస్వామి, ఉపాధ్యక్షుడు రమేష్‌రెడ్డి, సూపర్‌వైజర్ పద్మజ, ఎస్.అశోక్, సునీల్, ప్రవీణ్, సన్నీ, కార్తీక్, లక్ష్మీ, మాధవి, రత్న, గౌరీ, ప్రేమదేవి, ఆశావర్కర్లు మంగ, మణెమ్మ, రేణుక తదితరులు పాల్గొన్నారు.


నేడు ఔషధ మొక్కలపై అవగాహన సదస్సు

ఏజీవర్సిటీ: రాజేంద్రనగర్‌లో శ్రీ కొండా లక్ష్మణ్ ఉద్యాన కళాశాలలో రైతులకు ఔషధ మొక్కలపై అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు ఉద్యానవన అధికారులు తెలిపారు. ముఖ్యంగా ఉద్యాన పంటలలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వాటి నిర్వహణ విత్తనంలో ఎంపికలు, ఔషధ మొక్కలు ఏ విధంగా నాటుకోవాలి అనే అంశాలపై అవగాహన కల్పిస్తామన్నారు. అలాగే వాటిని నిర్వహణ ఏ విధంగా ఉంటుంది అనే అంశాలపై రాష్ట్రంలోని సీనియర్ హార్టికల్చర్ శాస్త్రవేత్తల ద్వారా అవగాహన కల్పిస్తారన్నారు. కార్యక్రమంలో ఉద్యాన విశ్వవిద్యాలయం వీసీ దండ రాజిరెడ్డితో పాటు అధికారులు పాల్గొంటారని తెలిపారు.

యూకే రాయల్ సొసైటీ ఫెలోగా ప్రొ.జగదీష్

రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ ప్రొఫెసర్ చెన్నుపాటి జగదీష్ యూకేలోని రాయల్ సొసైటీ ఫెలో(ఎఫ్‌ఆర్ఎస్)గా ఎన్నికయ్యారు. హెచ్‌సీయూలోని ఇనిస్టిట్యూషన్ ఆఫ్ ఎమినెన్స్ చైర్ ప్రొఫెసర్ జగదీష్‌కు ప్రతిష్ఠాత్మక గుర్తింపు లభించింది. నానోటెక్నాలజీ, సెమీకండక్టర్ ఆప్టో ఎలక్ట్రానిక్స్, ఆప్టో ఎలక్ట్రానిక్ అప్లికేషన్ల కోసం కొత్త రకాల ఎల్ఈడీలు, లేజర్లు, నానో పరికరాల అభివృద్ధికి కృషి చేశారు.

విద్యార్థులకు ఉపాధ్యాయులే మార్గదర్శకులు



మాట్లాడుతున్న పరమేశ్వరమ్మ

గోల్కొండ: విద్యార్థులకు ఉపాధ్యాయులు మార్గదర్శకులుగా ఉండాలని రిసాల బజార్‌లోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పి.పరమేశ్వరమ్మ అన్నారు. గోల్కొండ ఖైరతాబాద్-1, 2, షేక్‌పేట్ మండలాలకు చెందిన ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయుల శిక్షణ శిబిరం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..ప్రభుత్వ పాఠశాలలు నేడు కార్పొరేట్‌కు దీటుగా తయారయ్యాయన్నారు. ప్రాథమిక తరగతుల్లోనే విద్యార్థుల ప్రతిభకు సానబెట్టే ఉన్నత పాఠశాలలో విద్యార్థులు మరింత రాటుతేలుతారన్నారు. గతంతో పోలిస్తే నేడు విద్యాబోధనలో ఎన్నో మార్పులు వస్తున్నాయని ఆమె అన్నారు. ఈ మార్పులను అందిపుచ్చుకున్న వారే ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎదుగుతారన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ ఐఓఎస్ కార్యాలయ సిబ్బంది జాన్, జాకేర్, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాహుఫ్‌రెహెన్, 140 మంది ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రెండు మున్సిపాలిటీల మధ్య రోడ్డు...

లింక్ కలిసేనా?

- సంవత్సరాలు గడుస్తున్నా సాగని పనులు
- ప్రజలకు తప్పని ఇబ్బందులు
- పట్టించుకోని అధికారులపై సర్వత్రా ఆగ్రహం



బీఆర్‌సీ అపార్ట్‌మెంట్స్ వైపు నిలిచిపోయిన లింక్ రోడ్డు పనులు

మణికొండ: అది రెండు మున్సిపాలిటీల మధ్య దూరాన్ని తగ్గించే లింకు రోడ్డు. లంగర్‌హౌస్ నుంచి గండిపేటకు ఉన్న రేడియల్ రోడ్డు-4కు షేక్‌పేట నుంచి నార్సింగికి ఉన్న రేడియల్ రోడ్డు-5లకు లింక్ కలిపే వంద అడుగుల రోడ్డు ఇది. దాన్ని 2015వ సంవత్సరంలో హెచ్‌ఎండీఏ మాస్టర్ ప్లాన్‌లో పెట్టి అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం భూ సేకరణ చేసింది. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం 2022లో రోడ్డును నిర్మించేందుకు రూ. 5 కోట్లతో పనులను చేపట్టింది. అది కాస్తా ఓవైపు అప్పటి హెచ్‌ఎండీఏ అధికారులు కొంత భూ సేకరణ సరిగా చేయకపోవటం, మరో వైపు మిలటరీ స్థలం అడ్డు రావటంతో 2.5 కిలోమీటర్ల మేర పనులు చేశాక నిలిచిపోయాయి. సేకరించిన భూమిలోనే అదే హెచ్‌ఎండీఏ 'అనకొండలు' 2017లో ఏకంగా ఓ గేటెడ్ కమ్యూనిటీకి అనుమతులు ఇచ్చారు. అది కాస్తా రోడ్డుకు అడ్డుగా రావటంతో పనులను అర్ధాంతరంగా నిలిపివేశారు. అదే విషయాన్ని అప్పట్లో 'సాక్షి' దినపత్రిక ' రోడ్డెందుకు సన్నబడింది!' అనే శీర్షికన ప్రత్యేక కథనాన్ని ప్రచురించింది. దాంతో కదిలిన అధికార యంత్రాంగం సదరు గేటెడ్ కమ్యూనిటీ ప్రహరీని కూల్చి రోడ్డును విస్తరించేందుకు యత్నించారు. అదే సమయంలో గేటెడ్ కమ్యూనిటీ పక్కన ఉన్న భూమిని సేకరించలేదనే విషయం వెలుగులోకి వచ్చింది.

సంవత్సరాలు గడుస్తున్నా...

షేక్‌పేట-నార్సింగి రేడియల్ రోడ్డు-5కు బీఆర్‌సీ అపార్ట్‌మెంట్స్ వద్ద అలకాపూర్ టౌన్‌షిప్ మీదుగా వచ్చే వంద అడుగుల రోడ్డు లింక్ కలవాలంటే మరో అర ఎకరం భూమి సేకరించాలని అప్పట్లోనే హెచ్‌ఎండీఏ అధికారులు నిర్ణయించారు. భూ యజమానులకు నోటీసులను జారీ చేయటం, పలుమార్లు సమావేశాలు నిర్వహించారు. వారు అడిగిన పరిహారాన్ని ఇచ్చే విషయం త్వరలోనే తేల్చి రోడ్డును లింక్ కలుపుతామన్నారు. అంతలోనే ప్రభుత్వం మారటంతో ఆ పనులు అటకెక్కాయి. భూమిని ఇచ్చేందుకు యజమానులు సిద్ధంగా ఉన్నా, పరిహారం ఇచ్చే విషయాన్ని తేల్చకుండా నాన్చడంతోనే రోడ్డు పనులు ఆలస్యం అవుతున్నాయనే విమర్శలున్నాయి.



నార్సింగి వైపు మిలిటరీ వారు మూసివేసిన లింక్ రోడ్డు

కేంద్ర మంత్రులను కలిసినా...

లంగర్‌హౌస్ నుంచి గండిపేటకు ఉన్న రేడియల్ రోడ్డు-4 నుంచి అలకాపూర్ టౌన్‌షిప్ మీదుగా రావాల్సిన లింక్ రోడ్డుకు ప్రారంభంలో మిలటరీ స్థలం అడ్డుగా వచ్చింది. తమ భూమిలో నుంచి లింక్ రోడ్డు వేయాలంటే అనుమతులు తెచ్చుకోవాలని వారు మట్టి కుప్పలు అడ్డుగా పోసి అప్పటి వరకు ఉన్న మట్టి రోడ్డును సైతం మూసి వేశారు. అదే విషయాన్ని గతంలో కేంద్ర హోంశాఖ సహాయ మంత్రిగా పనిచేసి జి.కిషన్‌రెడ్డి, ప్రస్తుతం అదే శాఖను కొనసాగిస్తున్న బండి సంజయ్‌కుమార్‌ల దృష్టికి స్థానికులు, ప్రజాప్రతినిధులు ఈ విషయాన్ని పలుమార్లు తీసుకెళ్లారు. అయినా ఫలితం లేదు.

బీఆర్‌సీ వైపు సునాయాసం



నార్సింగి, మణికొండ మున్సిపాలిటీలను కలిపేలా అలకాపూర్ టౌన్‌షిప్ మీదుగా ప్రతిపాదించిన లింక్ రోడ్డుతో స్థానికులకు ఎంతో ప్రయోజనం. ఒక వైపు అడ్డుగా ఉన్న మిలిటరీ నుంచి అనుమతులు రావటం ఆలస్యం అవటం సహజం. మరో వైపు హెచ్‌ఎండీఏ అధికారులు ఎకరం భూమిని సేకరించి రోడ్డు నిర్మించటం సునాయాసం. సంవత్సరాలు గడుస్తున్నా ఆ విషయాన్ని అధికారులు పట్టించుకోకపోవటం శోచనీయం.

- ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, అధ్యక్షుడు గర్వా, అలకాపూర్ టౌన్‌షిప్

అధికారులను అడుగుతున్నాం



అలకాపూర్ టౌన్‌షిప్ మీదుగా ఉన్న వంద అడుగుల లింక్ రోడ్డు పనులను పూర్తి చేసి ప్రజల ఇబ్బందిని తీర్చాలని మున్సిపల్, హెచ్‌ఎండీఏ, హైడ్రా అధికారులను కలుస్తాం. ఇప్పటికే మున్సిపల్ కమిషనర్‌తో ఈ విషయం చర్చించాము. హెచ్‌ఎండీఏ కమిషనర్‌ను కలిసి భూ యజమానులకు టీడీఆర్ ఇచ్చి భూమిని స్వాధీనం చేసుకోవాలని కోరుతాం.

- వంశీ, అధ్యక్షుడు, అలకాపూర్ టౌన్‌షిప్

రోడ్డు వేసేందుకు సిద్ధం



లింక్ రోడ్డుకు అవసరమైన భూమిని తీసుకునే బాధ్యత హెచ్‌ఎండీఏ వారికే ఉంటుంది. వారు భూమి తీసుకుంటే అవసరం అయితే మున్సిపల్ నిధులతో బీఆర్‌సీ వైపు లింక్ రోడ్డు పనులను పూర్తి చేసేందుకు మేము సిద్ధంగా ఉన్నాం. ఇప్పటికే హెచ్‌ఆర్‌డీసీఎల్, హెచ్‌ఎండీఏ అధికారులతో ఈ రోడ్డు విషయం చర్చించాము.

- డి.ప్రదీప్‌కుమార్, కమిషనర్, మణికొండ మున్సిపాలిటీ

విద్యుత్ సమస్యలున్నాయా...

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్, గగన్‌పహాడ్, శంషాబాద్ విద్యుత్ సబ్ డివిజన్ పరిధిలోని అధికారులతో పాటు ఎమర్జెన్సీ ఫోన్ నంబర్లు మారాయి. అత్యవసర సమయంతో పాటు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటే ఈ కింది నంబర్లను సంప్రదించాలని అధికారులు ఒక ప్రకటనలో కోరారు.

రాజేంద్రనగర్ ఏఈ:	87124 70086
ఫ్యూజ్ ఆఫ్ కాల్ (ఎఫ్‌ఓసీ):	87124 70113
శివరాంపల్లి ఏఈ:	8712470097
ఎఫ్ఓసీ:	87124 70087
హిమాయత్‌సాగర్ ఏఈ:	87124 70080
ఎఫ్ఓసీ:	87124 70106
కిస్మత్‌పూర్ ఏఈ:	87124 70142
ఎఫ్ఓసీ:	87124 70108
గగన్‌పహాడ్ ఏఈ:	87124 70153
ఎఫ్ఓసీ:	87124 70104
కాటేదాన్ ఏఈ:	87124 70133
ఎఫ్ఓసీ:	87124 70082
మైలార్‌దేవ్‌పల్లి ఏఈ:	87124 70085
ఎఫ్ఓసీ:	87124 70109
శాస్త్రిపురం ఏఈ:	87124 70155
ఎఫ్ఓసీ:	87124 70112
శంషాబాద్ ఏఈ:	87124 70092
ఎఫ్ఓసీ:	87124 70110
షాపూర్ ఏఈ:	87124 70146

గోల్కొండ బోనాలకు అందరి సహకారం అవసరం

గోల్కొండ: ఈ ఏడాది జరిగే గోల్కొండ కోట బోనాలకు అందరి సహకారం అవసరమని దేవి ఉపాసకులు ఎస్.రాజువస్తాద్ అన్నారు. శుక్రవారం ఆయన గోల్కొండ కోటలో జగదాంబిక మహంకాళి అమ్మవారి వృత్తిపని సంఘం మాజీ అధ్యక్షుడు బి.సాయిబాబాచారితో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అమ్మవారి ఆలయ కార్యానిర్వహణ అధికారి సలహాలు, సూచనల మేరకు బోనాల ఉత్సవాలకు సహకరిస్తామన్నారు. ఎటువంటి పొరపాట్లు లేకుండా బోనాలు విజయవంతం చేయాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందన్నారు. అయితే కొందరు కోటపై కేవలం జగదాంబిక అమ్మవారి ఆలయం ఒక్కటే ఉందని ప్రచారం చేస్తున్నారని, ఇది ఎంత మాత్రం సరికాదని మహంకాళి అమ్మవారు కూడా ఇక్కడే ఉన్నారన్నారు. ఈ కార్యక్రమంలో బి.శ్రీకాంత్ చారి తదితరులున్నారు.

పగటి వెలుగు ఎవరికోసం?



ఎంఎం పహడీ చౌరస్తాలో పగలు వెలుగుతున్న హైమాస్ట్ లైట్లు



సులేమాన్‌నగర్‌లో...



శాస్త్రిపురం బస్తీలో...

శాస్త్రిపురం: వీధి దీపాల నిర్వహణను గాలికి వదిలేశారు. నిర్వహణ లేమి కారణంగా రాత్రిపూటే కాకుండా పగలు కూడా వీధి దీపాలు వెలుగుతున్నాయి. పగలు, రాత్రి అనే తేడా లేకుండా విద్యుత్ దీపాలు నిరంతరాయంగా వెలుగుతున్నా సంబంధిత అధికారులు మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. సులేమాన్‌నగర్, శాస్త్రిపురం డివిజన్లలోని పలు ప్రాంతాల్లో వీధి దీపాలు నిరంతరాయంగా వెలుగుతున్నాయి. సాయంత్రం వేళలో విద్యుత్ దీపాలను ఆన్ చేసి ఉదయం ఆఫ్ చేయాల్సిన సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండటంతో పగలు సాయంత్రం తేడా లేకుండా వెలుగుతున్నాయి. ముఖ్యంగా సులేమాన్‌నగర్, ఎంఎం పహడీ చౌరస్తాలో, శాస్త్రిపురం బస్తీలలో ఎల్లప్పుడు విద్యుత్ దీపాలు ఆన్‌లోనే ఉంటున్నాయి. హైమాస్ట్ దీపాలే కాకుండా విద్యుత్ స్తంభాలకు ఏర్పాటు చేసిన దీపాలు కూడా వెలుగుతూనే ఉన్నాయి. విద్యుత్ స్తంభాలకు ఏర్పాటు చేసినా టైమర్లు పాడవడం కూడా వీధి దీపాలు నిరంతరం వెలిగేందుకు కారణమని చెబుతున్నారు. విద్యుత్‌ను ఆదా చేయాలని ప్రకటనలిచ్చే అధికారులు స్వయంగా తమ సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా విద్యుత్ వృథా అవుతున్నా ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని కాలనీల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇకనైనా సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి వీధి దీపాలను సక్రమంగా నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు



మణికొండ: కొత్త కనెక్షన్‌లు, ఫీడర్ల మెయింటెనెన్స్ పనుల నేపథ్యంలో శనివారం పలు ప్రాంతాలలో విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్లు మణికొండ ఏఈ సంతోష్‌కుమార్ తెలిపారు. ఉదయం 9 నుంచి 9.30 వరకు శ్రీరాంనగర్ కాలనీ, హనుమాన్‌నగర్ కాలనీ, అలకాపూర్ సెక్టార్-2 ఎ,బి,సి,డీ, ఆదిత్య ఫోర్ట్ విల్లాస్ ప్రాంతాల్లో విద్యుత్ ఉండదన్నారు. ఉదయం 9.30 నుంచి 10 గంటల వరకు భాగ్యలక్ష్మి కాలనీ, హుడాకాలనీ, ఫ్రెండ్స్ కాలనీ, తులిప్‌గార్డన్, 10 నుంచి 10.30 గంటల వరకు మై స్కేప్ ప్రాంతం, అలకాపూర్ రోడ్డు నెంబర్ 13 నుంచి 22 వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. మధ్యాహ్నం 12 నుంచి 1.30 గంటల వరకు పుప్పాలగూడ గ్రామం, మారుతీనగర్, దుర్గానగర్, రాఘవేంద్రకాలనీ, గోల్డన్ ఓరియో, మానస అపార్ట్‌మెంట్స్, ఎల్‌ఐసీ కాలనీ, అలకాపూర్ రోడ్డు నెంబర్ 8 ప్రాంతాల్లో విద్యుత్ నిలిపివేస్తామన్నారు. మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 4 గంటల వరకు అలకాపూర్ టౌన్‌షిప్ రోడ్డు నెంబర్ 13, కూలీకుదుబ్‌షా కాలనీ, పెంటయ్య నగర్, స్కైలా అపార్ట్‌మెంట్, వినాయక నగర్ ఫేజ్-2 కాలనీలలో విద్యుత్ సరఫరాను నిలిపివేస్తామని ఆయన తెలిపారు. మధ్యాహ్నం 3.30 నుంచి 4 గంటల వరకు అలకాపూర్ టౌన్‌షిప్ రోడ్డు నెంబర్ 3నుంచి 13 వరకు, 4గంటల నుంచి 4.30 వరకు సాయిగౌతమ్ కాలనీ, మాత్రుశ్రీ కాలనీ, సాయంత్రం 4 నుంచి 5.30 గంటల వరకు అలకాపూర్ రోడ్డు నెంబర్ 1,2, సెక్టార్ 2ఎ, బీ, సీ, ఆదిత్య ఫోర్ట్ విల్లాస్, శివాలయం, తిరుమలహిల్స్, డాలర్‌హిల్స్, ఖిజ్రా కాలనీ ప్రాంతాలలో విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నామని ఏఈ సంతోష్‌కుమార్ వివరించారు.

నార్సింగి ఏఈ పరిధిలో...

నార్సింగి మున్సిపాలిటీ పరిధిలోని కోకాపేట సబ్‌స్టేషన్‌లో ఉదయం 9 నుంచి 9.30 గంటల వరకు బాబుఖానర్ విల్లాస్, 250 గజాల కాలనీ, గ్రాండ్ ఇన్నా టెక్ విల్లాస్, దంతు స్వీట్‌హౌస్, గోల్డన్ మైల్, ఉదయం 9.30 నుంచి 10 గంటల వరకు ఖానాపూర్ గ్రామం, ఓఆర్‌ఆర్ సర్వీసు రోడ్డు ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని ఏఈ మణికంఠ తెలిపారు. ఉదయం 10.30 నుంచి 11 గంటల వరకు శాంతినగర్ కాలనీ, సబితానగర్, ట్రెజర్‌లాండ్, సీబీఐటీ కళాశాల ముందు ప్రాంతం, సాయంత్రం 4.30 నుంచి 5 గంటల వరకు మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని ఫెయిర్‌ఫీల్డ్ కాలనీ, ఈవీవీ కాలనీ, పోయనీర్ కాలనీ, వెంకటేశ్వర కాలనీ, మంచిరేవుల గ్రామం, మంత్రి విల్లాస్, గ్రీన్‌లాండ్, జైహింద్ కాలనీలలో విద్యుత్ ఉండదని ఆయన వివరించారు.

దారి దోపిడీ కేసులో ఇద్దరి అరెస్టు

అత్తాపూర్: దారి దోపిడీ కేసులో ఇద్దరు నిందితులను అత్తాపూర్ పోలీసులు అరెస్టు చేశారు. పోలీసుల సమాచారం మేరకు... అత్తాపూర్‌కు చెందిన యువకులు బైక్‌పై ప్రయాణిస్తున్న సమయంలో అత్తాపూర్‌కు చెందిన సర్దార్ హర్భజన్‌సింగ్(22), సచిన్ పవార్(20) బైక్ ఫైన్సార్లమని చెప్పి దాడి చేసి రూ. 2500ను దోచుకెళ్లారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు వారు దోచుకున్న నగదుతోపాటు పల్సర్ బైక్, సెల్‌ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నారు. నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

3 నెలలు.. 6 బైక్‌లు చోరీ

నిందితుడి అరెస్ట్

గచ్చిబౌలి: ఆటో డ్రైవర్‌గా పని చేసే ఓ యువకుడు మూడు నెలల్లో ఆరు బైక్‌లు చోరీ చేశాడు. రాయదుర్గం పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ సీహెచ్ వెంకన్న తెలిపిన ప్రకారం.. కర్నూల్ జిల్లా నందికొట్కూర్ మండలం మానంపల్లికి చెందిన లోకిశెట్టి మదన్ కిశోర్ అలియాస్ కలా మదన్(18) ఆటో డ్రైవర్. అమీన్‌పూర్ ఎల్లాపూర్ తండాలో ఉంటున్నాడు. ఈజీ మనీకి అలవాటు పడ్డ మదన్ బైక్‌లను చోరీ చేసి కుదువ పెట్టి వచ్చిన డబ్బుతో జల్సా చేస్తున్నాడు. మూడు నెలలుగా గచ్చిబౌలి పీఎస్ పరిధిలో రెండు, కేపీహెచ్‌బీ పీఎస్ పరిధిలో రెండు, రాయదుర్గం, భానూర్ పీఎస్ పరిధిలో ఒక బైక్‌ను చోరీ చేశారు. 2024లో రాయదుర్గం పీఎస్ పరిధిలో రెండు బైక్‌లు చోరీ చేసి జైలుకు వెళ్లి వచ్చాడు. తిరిగి మదన్ చోరీలకు పాల్పడుతున్నాడు. నిందితుడిని అరెస్ట్ చేసిన రాయదుర్గం పోలీసులు రూ.4 లక్షల విలువైన ఆరు బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు.

డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల నిర్మాణాన్ని వెంటనే చేపట్టాలి

గోల్కొండ: జియాగూడలో పెండింగ్‌లో ఉన్న డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల నిర్మాణాన్ని వెంటనే చేపట్టాలని కార్వాన్ నియోజకవర్గం కాంగ్రెస్ సీనియర్ నాయకుడు మిత్ర కృష్ణ అన్నారు. శుక్రవారం హైదరాబాద్ డీఆర్‌ఓ వెంకటచారిని కలిసి వినతిపత్రం సమర్పించారు. జియాగూడలో నిరుపేద కుటుంబాలు ఎన్నో ఉన్నాయని, ప్రభుత్వాలు మారిన కూడా వారు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల కోసం వెయ్యి కళ్లతో ఎదురు చూస్తున్నారని వినతి పత్రంలో పేర్కొన్నారు. ఆ ఫైల్‌ను వెంటనే క్లీయర్ చేసి ఇళ్ల నిర్మాణానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని కోరారు.



అంగరంగ వైభవంగా పోచమ్మ విగ్రహ ప్రతిష్ఠాపన



దేవాలయ నిర్మాణ దాతలను సన్మానిస్తున్న కమిటీ సభ్యులు

అత్తాపూర్: వేదపండితుల మంత్రోచ్ఛరణల నడుమ నల్ల పోచమ్మ విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు అంగరంగ వైభవంగా జరిగాయి. అత్తాపూర్ డివిజన్ హైదర్‌గూడలోని నల్ల పోచమ్మ దేవాలయ విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలను డాక్టర్ బాబు జగ్జీవన్‌రామ్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు జరిగిన మహోత్సవాలు శుక్రవారం ముగిశాయి. ఉదయం నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించి మధ్యాహ్నం 12 గంటలకు మహా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. సాయంత్రం మహిళలు బోనాలను తీసుకొచ్చి అమ్మవారికి నైవేద్యంగా సమర్పించారు. పోతరాజుల విన్యాసాలు, బ్యాండ్ వాయిద్యాలు, యువత కేరింతల నడుమ భక్తిశ్రద్ధలతో అమ్మవారికి పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో ప్రతిష్ఠాపనోత్సవాల్లో పాల్గొన్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా దేవాలయ కమిటీ నిర్వాహకులు పటిష్ట ఏర్పాట్లు చేశారు.

మొక్కలతోనే జీవితం



మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రారంభించిన కమిషనర్ ప్రదీప్‌కుమార్

మణికొండ: పర్యావరణంతో పాటు ఆరోగ్యాలను పరిరక్షించుకోవాలంటే ప్రతి ఒక్కరూ వీలైనన్ని ఎక్కువ మొక్కలను నాటి వాటిని సంరక్షించాల్సిన అవసరం ఎంతైనా ఉందని మణికొండ మున్సిపల్ కమిషనర్ డి. ప్రదీప్‌కుమార్ అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని నెక్నాంపూర్ చెరువు వద్ద అమృత్ మిత్ర కార్యక్రమంలో బాగంగా విమెన్ ఫర్ ట్రీస్ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ... మున్సిపాలిటీ పరిధిలోని మహిళా సంఘాల వారు మున్సిపాలిటీ పరిధిలో వీలైనన్ని ఎక్కువ మొక్కలను నాటాలన్నారు. వాటిని సంరక్షించి పెద్ద చేసి మున్సిపాలిటీలో స్వచ్ఛమైన గాలి, పర్యావరణం మెరుగుపడేందుకు కృషి చేయాలన్నారు. రాబోయే వర్షా కాలంలో పెద్ద ఎత్తున మొక్కలను నాటేందుకు ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహించాలన్నారు. మున్సిపల్ మేనేజర్ శ్రీధర్, టీఎంసీ లక్ష్మీ, డీఈ శివసాయి, ఆర్పీలు పాల్గొన్నారు.

మూగజీవాలకు ప్రాణాంతకంగా 'ప్లాస్టిక్'



కాంక్రీట్ జంగిల్‌గా మారినా రాజేంద్రనగర్‌లో పశువులకు పచ్చ గడ్డి కరువైంది. పశువులను పెంచుకునే ఇష్టం ఉన్నా వాటికి పచ్చగడ్డిని అందించలేక కొందరు రోడ్లపైకి వదిలేస్తున్నారు. దీంతో పశువులు ఆహారం కోసం తోపుడు బండ్లు, చెత్త కుప్పల వద్దకు చేరి తమ ఆకలిని తీర్చుకుంటున్నాయి. శాస్త్రిపురం, సులేమాన్‌నగర్ డివిజన్‌లలో చాలా మంది మేకలను పెంచుతున్నారు. వాటికి మేత లేకపోవడంతో అవి చెత్త కుప్పల వద్దకు చేరి ప్లాస్టిక్ కవర్లు ఇతర వ్యర్థాలను తింటున్నాయి. అదికాస్తా ఆయా మూగజీవాలకు ప్రాణాంతకంగా తయారవుతోంది. నిరంతరం బస్తీలలో తిరుగుతూ ప్లాస్టిక్ వ్యర్థాలను తింటుండంతో కొన్ని సార్లు ప్రాణాలు కోల్పోతున్నాయని జంతు ప్రేమికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పశువులను బాధ్యతగా చూసుకోవాల్సిన యజమానులు వాటిని రోడ్లమీదకు వదిలేస్తుండటంతో అవి ప్లాస్టిక్ వ్యర్థాల కారణంగా రోగాలతోపాటు మృత్యుబారిన పడుతున్నాయి. - శాస్త్రిపురం